# నమస్తే తెలంగాణ
# సూర్యాపేట
5 | ఖమ్మం , బుధవారం 25 జూన్ 2025 | SURYAPET




## దవాఖానలో గదులకు తాళం వేయడంపై కలెక్టర్ ఫైర్

నకిరేకల్, జూన్ 24 : ప్రభుత్వ దవాఖాన సూపరింటెండెంట్ శోభారాణి ఎక్కడ? గదులకు తాళాలు ఎందుకు ఉన్నాయి? సేవలందించాల్సిన బాధ్యత వైద్యులపై, సిబ్బందిపై లేదా? అని కలెక్టర్ ఇలా త్రిపాఠి సీరియస్ అయ్యారు. నకిరేకల్‌లోని ప్రాంతీయ ఆస్పత్రిని మంగళవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు.






# జిల్లా అధికారుల సాక్షిగా
# అన్నదాతకు అవమానం



రైతు అంబటి భిక్షమయ్యను లాక్కెళ్తున్న అధికారులు, కలెక్టర్ సెక్యూరిటీ సిబ్బంది

- సీఎం ప్రసంగం వినకుండానే రైతు వేదిక నుంచి వెనుదిరిగిన రైతులు
- అన్నదాతను తోసుకుంటూ తీసుకెళ్లిన అధికారులు
- హాజరైన వారిలోఅధికారులే ఎక్కువ

నకిరేకల్, జూన్ 24 : నకిరేకల్ మండలం చందుపట్ల రైతువేదిక వద్ద రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన రైతు భరోసా సంబురాల్లో జిల్లా అధికారులైన కలెక్టర్ ఇలా త్రిపాఠి, జిల్లా వ్యవసాయశాఖ అధికారి శ్రవణ్, ఆర్డీఓ అశోక్‌రెడ్డి సాక్షిగా అన్నదాతకు అవమానం జరిగింది. ఖాతాలో పడిన రైతు భరోసా సొమ్మును బ్యాంకు వారు జప్తు చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేస్తూ కలెక్టర్‌ను అడుగుదామని వెళ్తున్న ఓ రైతును కలెక్టర్ సెక్యూరిటీ సిబ్బంది, వ్యవసాయ, రెవెన్యూ శాఖ అధికారులు లాక్కెళ్తున్నా జిల్లా అధికారులు స్పందించలేదు. పైగా హడావుడిగా అధికారులు రైతు వివరాలు కనుక్కొని బ్యాంకుకు ఫోన్ చేసి రేపు డబ్బులు తెచ్చుకోమని అక్కడి నుంచి పంపించేశారు. ఇదిలా ఉండగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగం ప్రారంభంలో రైతువేదికపై ఉన్న మైకు మొరాయించింది. దీంతో వెనుక కూర్చున్న రైతులకు సీఎం ప్రసంగం వినబడకపోవడంతో ఒక్కొక్కరుగా బయటకు వెళ్లిపోయారు. బయటకు వెళ్లిన రైతులను పోలీసులు, వ్యవసాయ, రెవెన్యూ శాఖల సిబ్బంది బతిమిలాడి తీసుకొచ్చి కూర్చొబెట్టారు. జిల్లా కలెక్టర్ త్రిపాఠి ప్రసంగిస్తున్న సమయంలో జిల్లా స్థాయి అధికారులు ఉన్నా రైతులు లేకపోవడంతో ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. రైతు వేదిక వద్దకు రైతులు పెద్ద సంఖ్యలో రావాలని అధికారులు ప్రచారం చేసినా ఫలితం లేకుండా పోయింది. సంబురాల కార్యక్రమానికి 30 మంది రైతులు కూడా రాకపోవడం గమనార్హం. హాల్ నిండా అధికారులే కూర్చున్న పరిస్థితి కనిపించింది. వ్యవసాయశాఖ అధికారులు సరైన ఏర్పాట్లు చేయకపోవడమే కార్యక్రమం విఫలమైనట్లు పలువురు చర్చించుకుంటున్నారు. ఏదేమైనా రైతులు తమ గోడును కలెక్టర్‌కు చెప్పుకుందామన్నా ఆమెను కలువనివ్వకపోవడం సరికాదని పలువురు రైతులు విచారం వ్యక్తం చేస్తున్నారు. అసహనానికి గురైన కొందరు రైతులు సీఎం ప్రసంగం వినకుండా వెళ్లిపోయారు.

### బ్యాంకోళ్లు డబ్బు జమ చేసుకున్నరు..



నా పేరు అంబటి భిక్షమయ్య. నాకు 3 ఎకరాల 20 గుంటల వ్యవసాయ భూమి ఉంది. నకిరేకల్ ఎస్‌బీఐలో రూ.1,73,300 రుణం తీసుకున్నా. సీఎం రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేస్తమని చెప్పిండు. ఇంతవరకూ నాకు రుణమాఫీ కాలే. మొన్ననే రూ.20,050 రైతుభరోసా డబ్బులు పడ్డయ్. ఇట్ల పడ్డయ్. అట్ల అప్పుకు జప్తు చేసుకున్నరు బ్యాంకోళ్లు. ఇయ్యాల మా ఊరికి కలెక్టర్ వస్తదని చెప్పిన్రు. అందుకే రైతువేదిక దగ్గరకు వచ్చి కూసున్న. ఎనుక కుర్చీలో కూసున్న. రైతుభరోసా డబ్బులు బ్యాంకు నుంచి ఇప్పియ్యాలని కలెక్టరమ్మను అడుగుదామని లేచి ఆమె దగ్గరకు వెళ్లి అమ్మా అని పిలిచిన. అంతలోపే ఎవరెవరో సార్లు వచ్చి నన్ను లాక్కోని బయటకు తీసుకొచ్చారు. పొలం దున్నిద్దామన్నా, విత్తనపు వడ్లు తెచ్చుకుందామన్నా పైసల్లేవు. మూడో కారులో పడ్డ పైసలు కూడా బ్యాంకోళ్లు లాగేసుకున్నరు. యాడ అప్పుతెచ్చి వ్యవసాయం చేయాలే. మీరు సంబురాలు చేసుకుంటున్నారు. నా కుటుంబం పస్తుండాల్సిన పరిస్థితి వచ్చింది.

– అంబటి భిక్షమయ్య, చందుపట్ల రైతు

- మ్యూచువల్‌పై వచ్చి.. డిప్యుటేషన్లతో సొంత ప్రాంతానికి పోస్టింగ్
- ప్రజాప్రతినిధుల అండ.. విద్యాశాఖ మౌఖిక ఆదేశాలతో మరి కొందరికి డిప్యుటేషన్
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయ సంఘాలు, టీచర్లు




# నల్గొండ విద్యాశాఖలో..
# మళ్లీ డిప్యుటేషన్ల రగడ!

రామగిరి, జూన్ 24: బడులు ప్రారంభమై పక్షం రోజులు గడవక ముందే నల్లగొండ జిల్లా విద్యాశాఖలో టీచర్ల డిప్యుటేషన్ ప్రక్రియ జోరుగా సాగుతోంది. ఇప్పటికే పలు విషయాల్లో ఆభాసుపాలవుతున్న విద్యాశాఖ అధికారులు 'నవ్విపోదురుగాక..నాకేటి..' అన్న చందంలా వ్యవహరిస్తూ నిబంధనలకు విరుద్ధంగా డిప్యుటేషన్స్‌కు శ్రీకారం చుట్టడంతో పైరవీల జోరు కొనసాగుతోంది. జీవో 317తో మ్యూచ్‌వల్‌గా రూ.లక్షలు పుచ్చుకొని జీరో సర్వీసుతో జిల్లాలో అడుగుపెట్టిన ఇద్దరు ఉపాధ్యాయులు మళ్లీ రాజకీయ అండతో తమ సొంత ప్రాంతానికి డిప్యుటేషన్‌పై వెళ్లారు. మరికొందరు అదే రాజకీయ నాయకుల సిఫార్సు.. మౌఖిక ఆదేశాలతో డిప్యుటేషన్స్‌పై వెళ్లడంపై విద్యాశాఖపై విమర్శలు వస్తున్నాయి. అక్రమ డిప్యుటేషన్స్‌ను తక్షణమే ఆపాలని, ఇచ్చిన డిప్యుటేషన్స్‌ను రద్దు చేసి వారు పనిచేసే ప్రాంతాలకు పంపించాలని పలు ఉపాధ్యాయ సంఘాలు, టీచర్లు డిమాండ్ చేస్తుండటం గమనార్హం.

### వెనుకబడి ప్రాంతాల నుంచే..

వాస్తవానికి జిల్లాలో వెనుకబడిన మారుమూల మండలాల్లోని గ్రామాల్లో ఉపాధ్యాయుల అవసరం అధికంగా ఉంటుంది. ఆ ప్రాంతాల్లో ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన పిల్లలే అధికం. అక్కడి పిల్లలకు విద్యనందించి తీర్చిదిద్దాల్సిన అవసరం ఉంది. వాటిని పట్టించుకోకుండా ఏకంగా డిప్యుటేషన్‌పై వెళ్లడం.. ఇందుకు జిల్లా విద్యాశాఖ అధికారులు అండంగా ఉంటూ వాస్తవిక పరిస్థితులను పరిగణలోకి తీసుకోకుండా డిప్యుటేషన్‌పై పంపడం పట్ల ఉపాధ్యాయ సంఘాల నేతలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

### డిప్యుటేషన్ ఇలా ..

- అడవిదేవులపల్లిలో పని చేస్తున్న ఓ టీచర్ మాడుగులపల్లి మండలానికి, చండూరు మండలం నేర్మట నుంచి నల్లగొండ మండలం కత్తాలగూడకు ఎలాంటి ఉత్తర్వులు లేకుండా ఓరల్ డిప్యుటేషన్‌పై వచ్చారు.
- గుడిపల్లి మండలంలోని మాదాపురం పాఠశాలకు జీవో 317లో జీరో సర్వీసుపై మ్యూచువల్‌తో వచ్చిన ఉపాధ్యాయుడు ఏకంగా నేషనల్ హైవే (అద్దంకి–నార్కట్‌పల్లి) ఉన్న కేతేపల్లి మండలంలోని చెర్కుపల్లి పాఠశాల ( తమ స్వస్థలం సమీపంలోకి), పీఏపల్లి మండలంలోని దుగ్యాల నుంచి ఇదే కేతేపల్లి మండలానికి ఈ ఇద్దరు టీచర్స్ డిప్యుటేషన్‌పై వెళ్లారు. వీరు ఇద్దరు మ్యూచువల్ బదిలీపై సూర్యాపేట జిల్లా నుంచి నల్లగొండ జిల్లాకు వచ్చిన వారే. వీరు కలెక్టర్ ఉత్తర్వులతో సూర్యాపేటకు సమీపంలోకి తమ పలుకుబడి ఉపయోగించి డిప్యుటేషన్‌తో వెళ్లారనే విమర్శలు వస్తున్నాయి.
- గుర్రంపోడు మండలంలోని ఊట్లపల్లి యూపీఎస్‌లో ఉపాధ్యాయుల అవసరం ఉంది. అయినప్పటికీ ఇక్కడ పని చేస్తున్న ఓ ఉపాధ్యాయుడు చిట్యాల ప్రాథమిక పాఠశాలకు డిప్యుటేషన్‌పై వచ్చారు. చిట్యాల పాఠశాలలో ఇప్పటికే ఆరుగురు ఉపాధ్యాయులు పని చేస్తున్నప్పకీ అవసరం లేకున్నా ఆ ఉపాధ్యాయుడిని డిప్యుటేషన్ వేయించుకున్నారు.

### తక్షణమే రద్దు చేయాలి



వాస్తవానికి ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు జులై 16 తర్వాత టీచర్ల సద్దుబాటు చేయాలని ఆదేశాలున్నాయి. నల్లగొండ జిల్లాలో మాత్రం అందుకు విరుద్ధంగా అక్రమ డిప్యుటేషన్స్ పర్వం కొనసాగుతున్నది. నిబంధనల మేరకు అదే మండలంలోగానీ, కాంప్లెక్స్ పరిధిలోగానీ డిప్యుటేషన్ ఇవ్వొచ్చు. గతేడాది జరిగిన పరిణామాలను దృష్టిలో ఉంచుకొని మా సంఘం నుంచి వేసవిలోనే డీఈవోకు అక్రమడిప్యుటేషన్ ఇవ్వొద్దని లేటర్ ఇచ్చాం. ప్రజాప్రతినిధులు, అధికారుల ఆదేశాలతో డిప్యుటేషన్ చేయడం సరైందికాదు. తక్షణమే అక్రమ డిప్యుటేషన్స్ రద్దు చేయాలి.

–బక్కా శ్రీనివాసాచారి, టీఎస్‌యూటీఎఫ్ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు

# ఇండ్ల నిర్మాణ పనులు
# వేగవంతం చేయాలి

**రైతులకు ఎరువుల కొరత లేకుండా చూడాలి: కలెక్టర్**



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ హనుమంతరావు

భువనగిరి కలెక్టరేట్, జూన్ 24 : ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో ఇందిరమ్మ ఇండ్లు, వన మహోత్సవం, సీజనల్ వ్యాధులు, ఆయిల్ పామ్, ఎరువులు, భూ భారతి తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో స్పష్టమైన ప్రగతి కనిపించేలా అధికారులు క్షేత్రస్థాయిలో కృషి చేయాలని సూచించారు. ఇండ్లు మంజూరైన లబ్ధిదారులు వెంటనే నిర్మాణ పనులు పూర్తి చేసేలా ప్రోత్సహించాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు పూర్తయ్యేలా నిరంతర పర్యవేక్షించాలని కలెక్టర్ అధికారులను కోరారు. వన మహోత్సవంలో భాగంగా వానకాలం మొదలైనందున మొక్కలు పెద్ద సంఖ్యలో నాటాలని సూచించారు. మొక్కలు నాటేందుకు అనువైన ప్రదేశాన్ని చూడాలన్నారు. రైతులకు ఎరువుల కొరత లేకుండా చూడాలన్నారు. జిల్లాలో ఆయిల్ పామ్ సాగుకు రైతాంగాన్ని ప్రోత్సహించాలన్నారు. ఆయిల్ పామ్ సాగు కోసం రైతులకు అవగాహన కల్పించాలన్నారు. భూ భారతి ద్వారా స్వీకరించిన దరఖాస్తులను వేగవంతంగా పరిష్కరించేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్లాలన్నారు. క్షయ వ్యాధి నిర్మూలన కోసం ప్రభుత్వం టీబీ ముక్త్ భారత్ కార్యక్రమం నిర్వహిస్తోందని తెలిపారు. సీజనల్ వ్యాధులు మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా తదితర వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలన్నారు. దోమల వ్యాప్తిని నిరోధించేందుకు ఫాగింగ్ ఆయిల్ బాల్స్ అందుబాటులో ఉంచాలన్నారు. సమావేశంలో జడ్పీ సీఈవో శోభారాణి, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి నాగిరెడ్డి, భువనగిరి, చౌటుప్పల్ ఆర్డీవోలు కృష్ణారెడ్డి, శేఖర్ రెడ్డి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు పర్యావరణంపై
# అవగాహన ఉండాలి

**జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తదితరులు

సూర్యాపేటటౌన్, జూన్ 24: ప్రతి విద్యార్థికి పర్యావరణంపై అవగాహన ఉండాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా విద్యాధికారి అశోక్‌తో కలిసి నేషనల్ స్టూడెంట్ పర్యావరణ కాంపిటీషన్ –2025 పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల కోసం జులై 1 నుంచి పర్యావరణ క్విజ్ ప్రారంభమవుతుందన్నారు. వాతావరణ మార్పులు, పర్యావరణ పరిరక్షణ, విద్యార్థుల్లో పర్యావరణ నైపుణ్యం పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలోని అన్ని విద్యాసంస్థల విద్యార్థులు పోటీల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. హార్ట్ ద వే ఆఫ్ లైఫ్ అనే థీమ్ దేశ వ్యాప్తంగా ఎన్‌ఎస్‌పీసీ పోటీని పర్యావరణ సంరక్షణ నిర్వహిస్తుందన్నారు. ఈ క్విజ్ పోటీకి జులై 1 నుంచి ఆగస్టు 21 వరకు రిజిస్ట్రేషన్ అందుబాటులో ఉంటుందన్నారు. ఫలితాలు ఆగస్టు 30న ప్రకటిస్తారని, ఒకటో తరగతి నుంచి పరిశోధన విద్యార్థుల వరకు ఐదు విభాగాల్లో పోటీ నిర్వహిస్తారన్నారు. ఎకోమిత్రమ్ యాప్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. హిందీ, ఇంగ్లిష్ భాషల్లో క్విజ్ ప్రశ్నలు ఉంటాయన్నారు. ఎలాంటి రిజిస్ట్రేషన్ ఫీజు లేదన్నారు. మొక్కలు నాటుతున్న, సేవ చేస్తున్న వీడియోలను అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందన్నారు. ఈ పోటీలు ఈసారి 5 విభాగాల్లో నిర్వహిస్తారన్నారు. 1 నుంచి 5వ తరగతి వరకు, 6 నుంచి 8వ తరగతి వరకు, 8 నుంచి 12వ తరగతి వరకు, డిగ్రీ చదువుతున్న విద్యార్థులు, ఇతర పౌరులు కూడా పాల్గొనవచ్చన్నారు. పోటీల్లో పాల్గొన్న ప్రతి విద్యార్థికి సర్టిఫికెట్ ఇస్తారని, విద్యాసంస్థలకు ప్రత్యేక గుర్తింపునిస్తుందన్నారు. వివరాలకు :https://ecomitram.app/ లో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో డీఈవో అశోక్, జిల్లా సైన్స్ అధికారి దేవరాజ్, సెక్టోరియల్ అధికారి శ్రావణ్, జనార్ధన్, రాంబాబు, అడల్ట్ ఎడ్యుకేషన్ అధికారి నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పాలిసెట్ కౌన్సెలింగ్ షూరు..

- 28 వరకు సర్టిఫికెట్ పరిశీలన కోసం స్లాట్ బుకింగ్
- 26 నుంచి 29 వరకు సర్టిఫికెట్స్ పరిశీలన – వెబ్‌ఆప్షన్స్
- నల్లగొండ ఉమ్మడి జిల్లాలో రెండు కౌన్సెలింగ్ కేంద్రాల ఏర్పాటు

రామగిరి, జూన్ 24: పాలిటెక్నిక్ డిప్లొమో కోర్సులో ప్రవేశానికి నిర్వహించిన టీఎస్ పాలిసెట్–2025 కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. నల్లగొండ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రెండు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో కౌనెన్సెలింగ్ కేంద్రాలను రాష్ట్ర సాంకేతిక విద్యశాఖ ఏర్పాటు చేసింది. పాలిసెట్‌లో ఎంపీసీ స్ట్రీమ్‌లో ర్యాంకులు సాధించిన అభ్యర్థులు ఆయా కేంద్రాల్లో (హెల్ప్‌లైన్ సెంటర్స్) సూచించిన తేదీల్లో హాజరై సద్వినియోగం చేసుకోవాలని నల్లగొండ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ నరసింహారావు వెల్లడించారు. కౌన్సెలింగ్ ప్రక్రియకు హాజరయ్యే విద్యార్థులు విధిగా అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్స్, జిరాక్స్, కులం, ఆదాయం ధ్రువీకరణ పత్రాలు తీసుకుని రావాలని సూచించారు

### కౌన్సెలింగ్ షెడ్యూల్ ఇలా..

- ఈ నెల 28 వరకు సర్టిఫికెట్ల పరిశీలన కోసం స్లాట్ బుకింగ్స్
- 26 నుంచి 29 వరకు స్లాట్ బుకింగ్ చేసిన విద్యార్థుల సర్టిఫికెట్ల పరిశీలన
- 26 నుంచి జూలై 1 వరకు సర్టికెట్ పరిశీలన చేసిన విద్యార్థులు కళాశాలల ఎంపిక కోసం వెబ్ ఆప్షన్స్ ఇచ్చుకునే అవకాశం

### ఉమ్మడి జిల్లాలోని కౌన్సెలింగ్ సెంటర్స్

- ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల – నల్లగొండ
- బాలికల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల – సూర్యాపేట

# చెప్పినట్లు వింటే..
# ఇందిరమ్మ ఇల్లు ఇప్పిస్తా..!

## ఓ మహిళను వేధిస్తున్న కాంగ్రెస్ నాయకుడు

## సదరు నేతకు బుద్ధిచెప్పిన గ్రామస్తులు

వేములపల్లి, జూన్ 24: ''నేను నియోజకవర్గ స్థాయి నాయకుణ్ని, నేను ఎంత చెప్తే అంతే.. ఎమ్మెల్యే నా మాటే వింటాడు.. నేను చెప్పినట్లు చేస్తే ఇందిరమ్మ ఇల్లు ఇప్పిస్తా' నంటూ వేములపల్లి మండలం మొల్కపట్నం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు ఓ మహిళను గత మూడు నెలలుగా తీవ్ర వేధింపులకు గురిచేస్తున్న వైనం వెలుగులోకి వచ్చింది. మిర్యాలగూడ మండలంలోని ఓ గ్రామానికి చెందిన మహిళకు సదరు కాంగ్రెస్ నాయకుడు ఇందిరమ్మ ఇల్లు ఇప్పిస్తానని, ఎమ్మెల్యేకు తాను ఏది చెప్తే అదే నడుస్తుందని నమ్మించాడు. ఆ మహిళ వద్ద నుంచి ఆధార్, పాన్‌కార్డు, రేషన్‌కార్డు జీరాక్సు కాపీలు తీసుకున్నాడు. ఇల్లు ఇప్పించకపోగా గత మూడు నెలలుగా ఆ మహిళకు ఫోన్ చేస్తూ వేధిస్తున్నాడు. ఆ మహిళ మిర్యాలగూడలోని ఒక కమర్షియల్ సెంటర్‌లో పనిచేస్తోంది. అక్కడికి కూడా వెళ్లి వేధింపులకు గురి చేస్తుండటంతో సదరు మహిళ ఈ విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పింది. దీంతో ఆమె తల్లిదండ్రులు పలుమార్లు ఆ నాయకుడికి ఫోన్ చేసి మా అమ్మాయి జోలికి రావొద్దని చెప్పినా వినకుండా బెదిరింపులకు పాల్పడ్డాడు. ఇటీవల వేధింపులు ఎక్కువ కావడంతో ఆమె తన తల్లిదండ్రులు, బంధువులను తీసుకొని మొల్కపట్నంలోని కాంగ్రెస్ నాయకుడి ఇంటికి వెళ్లి నిలదీసింది. దీంతో ఆ గ్రామానికి చెందిన వారు కూడా వంద మందికి పైగా గుమిగూడినట్లు సమాచారం. ఆమె పట్ల ఆ నాయకుడు ప్రవర్తించిన తీరును ఆ గ్రామస్తులు సైతం తప్పు పట్టారు. అలాగే ఆ మహిళకు సంబంధించిన జీరాక్స్ కాగితాలను తిరిగి ఇప్పించారు. అదేవిధంగా ఆ నాయకుడు ఫోన్‌లో ఉన్న మహిళ నంబర్లను సైతం తొలగించారు. మళ్లీ ఆమె జోలికి వస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. కాగా ఇలాంటి నాయకుల వల్ల పార్టీకి చెడ్డ పేరు వస్తుందని ఎమ్మెల్యే ఇటువంటి వారిని గుర్తించి కఠినంగా వ్యవహరించాలని స్థానికులు కోరుతున్నారు.


